క్లుప్తంగా

అంతర్గాం పోలీస్‌స్టేషన్ సందర్శన



రికార్డులను పరిశీలిస్తున్న డీసీపీ కరుణాకర్

రామగుండం: అంతర్గాం పోలీస్‌స్టేషన్‌ను బుధవారం పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా హెల్ప్ డెస్క్‌లో రికార్డులను పరిశీలించి అధికారుల పనితీరును పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు, పరిశోధనల్లో ఉన్న కేసులు, ఇతరత్రా రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్సై బోయ వెంకటస్వామి, సిబ్బంది ఉన్నారు. అంతర్గాం పోలీస్‌స్టేషన్‌ను తొలిసారి సందర్శించిన డీసీపీ పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ

పెద్దపల్లిరూరల్: రోడ్లపై వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని కమాన్‌చౌరస్తా వద్ద బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై ఆయన అవగాహన కల్పించారు. బైక్ నడిపే వారు హెల్మెట్, కార్ నడిపే వారు సీటు బెల్ట్ ధరించాలని, అనుకోకుండా ప్రమాదాల బారిన పడితే అవి ప్రాణాలు కాపాడుతాయని వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిని గుర్తించి జరిమానా విధిస్తామన్నారు.

ఆయిల్‌పాం పంట పరిశీలన

పాలకుర్తి: మండలంలోని కన్నాల గ్రామంలో ఆయిల్‌పాం తోటను మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామానికి చెందిన భూక్య బాలునాయక్ 2022–23లో ఆయిల్ పాం మొక్కలు నాటారు. ఈ మేరకు ఏవోతో పాటు ప్లాంటేషన్ అధికారి మొక్కలను పరిశీలించి మొదటి పూతను తొలగించారు. ప్రస్తుతం అవి గెలలు రావడం మొదలయ్యాయని, రెండు, మూడు నెలల్లో పూర్తిస్థాయిలో గెలలు మార్కెట్‌లో అమ్మేలా తయారవుతాయని ఏఓ పేర్కొన్నారు.

విద్యార్థులకు షీటీం అవగాహన

గోదావరిఖనిటౌన్: స్థానిక విఠల్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం షీటీం ఇన్‌చార్జి ఎస్‌ఐ లావణ్య ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. షీటీం మెంబర్ స్నేహలత మహిళల భద్రత, ఆన్‌లైన్ మోసాలు, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు వేధింపులకు గురైతే 63039 23700 నంబర్‌కు, డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. షీటీం సభ్యులు మౌనిక, సురేశ్, హెచ్‌ఎం సమ్మయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరిస్తా



బాధ్యతలు చేపడుతున్న వైనాల రాజు

కమాన్‌పూర్: కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ పరిధిలోని రైతుల సమస్యలు మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో పరిష్కరిస్తానని మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు అన్నారు. మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య, సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్లపై సంచరించే పశువులను గోశాలకు తరలిస్తాం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ప్రధాన రోడ్లపై సంచరించే పశువులను వాటి యజమానులు తీసుకెళ్లి మళ్లీ రోడ్లపైకి రాకుండా చూడాలని, లేకుంటే వాటిని గోశాలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ హెచ్చరించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, రోడ్లపై పశువుల సంచారం ఎక్కువైందన్నారు. పశువులు ఇష్టానుసారంగా రోడ్లపై తిరుగుతుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడడమే కాకుండా ప్రమాదాలకు గురవుతున్నారంటూ కలెక్టర్ దృష్టికి పలు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో పశువులను రోడ్లపైకి రాకుండా చూడాలని, వస్తే గోశాలకు తరలించాలని ఆదేశించారని ఆయన పేర్కొన్నారు. రెండురోజుల్లోగా పశువుల యజమానులు తీసుకెళ్లకపోతే పశుసంవర్ధకశాఖ, పోలీసు అధికారులు, మున్సిపల్ సమన్వయంతో గోశాలకు తరలిస్తామని, పశువుల కోసం వచ్చే యజమానులకు జరిమానా విధిస్తామన్నారు.

శిథిలావస్థలో వంతెనలు

- 50ఏళ్ల క్రితం కాలువలపై నిర్మాణం
- పట్టించుకోక పోవడంతో కూలుతున్న వైనం



కాచాపూర్ వద్ద శిథిలావస్థలో ఉన్న వంతెన

జూలపల్లి: మండలంలో ఉన్న శ్రీరాంసాగర్ ప్రధాన డి–83 కాకతీయ కాలువపై 50ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనలు అధికారులు పట్టించుకోక పోవడంతో శిథిలావస్థకు చేరాయి. ఇప్పటికే కుమ్మరికుంట వద్ద మినీ హైడల్ ప్రాజెక్టు కింద ఉన్న వంతెన రెండేళ్ల క్రితం కూలి కాలువలో పడి పోగా, నేటికీ వంతెన శిథిలాలను తొలగించలేదు. కాలువ అవతల భూములు ఉన్న రైతులు వ్యవసాయ పనులకు వెళ్లేందుకు తిప్పలు పడుతున్నారు. అలాగే కాచాపూర్ నుంచి పెద్దపల్లి మార్గంలో ఉన్న ప్రధాన రవాణాకు ఉపయోగ పడే వంతెనపై రంధ్రాలు పడి కూలే దశకు చేరుకుంది. దీనిపై బస్సుల్లో ప్రయాణించేందుకు ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. జూలపల్లి 1ఎల్‌ఆర్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ వద్ద వంతెన శిథిలావస్థకు చేరగా, అబ్బాపూర్ వద్ద ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుతోంది. వర్షాలకు వంతెనలపై నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటే కొంత మేరకైనా ఉపయోగం ఉంటుందని స్థానికులు అంటున్నారు.

వంతెన నిర్మించాలి

కుమ్మరికుంట వద్ద కాలువపై వంతెన కూలి రెండేళ్లు కావస్తోంది. వ్యవసాయ పనులకు కాలువ దాటాల్సిందే. వ్యవసాయ పనులకు కాలువ ఆవలికి పోవాలంటే రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ కొత్త వంతెన నిర్మించేందుకు ఎస్సారెస్పీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కుంట రాజేశ్వర్‌రెడ్డి, రైతు, కుమ్మరికుంట



కమాన్‌పూర్: మండలంలోని గుండారంలో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్‌కు తాగునీటి సరఫరా చేయడానికి కొత్తగా పైపులైన్ పనులు చేపట్టారు. మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి గుండారం అంబేడ్కర్ విగ్రహం సమీపంలో వారంక్రితం పైపులైన్ కోసం జేసీబీతో భారీ గుంత తవ్వించారు. పైపులైన్ పనులు పూర్తి చేయకపోవడంతో గుంత పూడ్చలేదు. దీంతో నివాస గృహాల వారు ఇబ్బందులు పడుతున్నారు. పైపులైన్ పనులు పూర్తి చేసి గుంత పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

ధర్మారం: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరికల సందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్‌కు బుధవారం సాయంత్రం పార్టీ నాయకులు ధర్మారంలో స్వాగతం పలికారు. ధర్మారం గ్రామ శివారు నుంచి మంత్రి బైక్ నడుపుతూ కార్యకర్తలతో ర్యాలీగా అంబేడ్కర్ చౌరస్తా వరకు చేరుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ఎండపల్లి మండలం రాజారాంపల్లి ఎస్ఆర్ గార్డెన్‌లో జరిగే చేరికల కార్యక్రమానికి ర్యాలీగా వెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అసోద అజయ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సోగాల తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లా నాయక్, ఖిలావనపర్తి దేవస్థానం కమిటీ చైర్మన్ సంతోష్, మాజీ ఎంపీపీ అంజన్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహులు పాల్గొన్నారు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచులు, యువకులు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో బుధవారం రాత్రి మంత్రి లక్ష్మణ్‌కుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. ఎండపల్లి మండలం ఎస్ఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ మండల నాయకుడు ఎల్లాల మహేందర్ రెడ్డి, ధర్మారం మండలకేంద్రానికి చెందిన బీఆర్ ఎస్ నాయకుడు దాగేటి ఉదయ్‌యాదవ్ వంద మంది తన అనుచరులతో కలిసి మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మండలంలోని కొత్తూరు, బుచ్చయ్యపల్లి, సాయంపేట మాజీ సర్పంచులు మల్లేశం, కొమురయ్య, చెనెళ్లి సాయికుమార్ కాంగ్రెస్‌లో చేరారు.

ఎమ్మెల్యేకు సన్మానం



సన్మానిస్తున్న సబ్బితం గ్రామస్తులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామశివారు గౌరీగుండాల జలపాతం అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి రూ.6కోట్లు కేటాయించడం సంతోషకరమని సబ్బితం మాజీ సర్పంచ్ చంద శంకర్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే విజయరమణారావును ఎలిగేడు మండలం శివపల్లిలోని ఆయన ఇంట్లో గ్రామస్తులతో కలిసి సన్మానించారు. జలపాతం ఉన్న ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా పూర్తిస్థాయిలో తీర్చిదిద్దాలని కోరారు. ప్రస్తుతం కేటాయించిన నిధులు కేవలం జలపాతం ప్రాంత అభివృద్ధి కోసమేనని, గ్రామంలోని ప్రధాన రోడ్డు నుంచి జలపాతం వరకు వెళ్లే రోడ్డు అభివృద్ధి కోసం కూడా నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నాయకులు కందుల అశోక్, కీర్తి హరీశ్, ప్రసాద్, కిష్టయ్య, రాజయ్య ఉన్నారు.

దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాల పంపిణీ

కోల్‌సిటీ/గోదావరిఖనిటౌన్: రామగుండం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో సుమారు 35మంది దివ్యాంగులకు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ సింహారాజు కోదండరాం కృత్రిమ అవయవాలు అందజేశారు. జిల్లా గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన కోదండరాం, తొలిసారి రామగుండానికి వచ్చిన సందర్భంగా పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు ఐడెంటీ కార్డులు పంపిణీ చేశారు. అలాగే సరస్వతి శిశు మందిర్‌లో మొక్కలు నాటారు. లయన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ డాక్టర్ బాబురావు ఘట్టమనేని పుట్టినరోజు సందర్భంగా మీల్స్ ఆన్ వీల్స్‌లో పేదలకు అన్నదానం చేశారు. లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పోకల ఆంజనేయులు, సెక్రటరీ ముడుతనపల్లి సారయ్య, ట్రెజరర్ రాజేంద్రకుమార్, మాజీ డిస్ట్రిక్ గవర్నర్ ముద్దసాని ప్రమోద్‌కుమార్‌రెడ్డి, రీజినల్ చైర్మన్ కజాంపురం రాజేందర్, జోన్ చైర్మన్ పి.మల్లికార్జున్, క్లబ్ సీనియర్ సభ్యులు మేడిశెట్టి గంగాధర్, తిలక్ చక్రవర్తి, గుండ వీరేశం, కె.లక్ష్మారెడ్డి, మనోజ్‌కుమార్ అగర్వాల్, బేణిగోపాల్ త్రివేది, గుండ రాజు, విజయలక్ష్మి, సత్యనారాయణ, రంగమ్మ, రమణారెడ్డి, కౌసల్య పాల్గొన్నారు.



కృత్రిమ అవయవాలు అందజేస్తున్న జిల్లా గవర్నర్ సింహరాజు కోదండరాం

సంక్షిప్త వార్తలు

• భార్య, కొడుకు కనిపించడం లేదని ఫిర్యాదు

ముత్తారం: ముత్తారంలోని కాసర్లగడ్డకు చెందిన కొమిరె భీమయ్య తన భార్య రేణుక, కుమారుడు మహేందర్ 15రోజుల నుంచి కనిపించడం లేదని బుధవారం ముత్తారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతల గూడెంకు చెందిన భీమయ్య భార్య, కుమారుడితో జీవనోపాధి కోసం 6నెలల క్రితం ముత్తారానికి వచ్చాడు. ముత్తారంలోని ఓ స్క్రాప్ దుకాణంలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 15న ఉదయం పనికి వెళ్లి రాత్రి ఇంటికి వచ్చేసరికి భార్య, కుమారుడు కనిపించలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. అదే స్క్రాప్ దుకాణంలో తనతోపాటు పనిచేసే ముత్తారం మండలంలోని కేషనపల్లికి చెందిన కల్వచర్ల సత్యనారాయణ అనే వ్యక్తి ఆరోజు నుంచి కనిపించడం లేదన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

• సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యవర్గం

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాలలో బుధవారం సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా కడారి వీరస్వామి, పెంద్రు నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా లోనె మాదయ్య, క్యాషియర్‌గా వడ్లకొండ సాయిలుగౌడ్, గౌరవ అధ్యక్షుడు గుండు శంకరయ్య, కార్యవర్గ సభ్యులు బసవత్తుల రాములు, వడ్లకొండ రాములు, కాసర్ల రాజిరెడ్డి, చిలుకట్ల రాజయ్య, మాదాసి రాజయ్య, గోగు మొండయ్య, పాకాల సాంబశివ రెడ్డి, సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

• పిచ్చిమొక్కల తొలగింపు

సుల్తానాబాద్: ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో పిచ్చిమొక్కలు పెరగకుండా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేశ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని పూసాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన పిచ్చిమొక్కలను బుధవారం కార్మికులు తొలగించారు. రహదారి వెంబడి వర్షానికి నిలిచిన ఇసుకను తొలగించారు.

• ఇందిరమ్మ లబ్ధిదారుల స్థలాల పరిశీలన

జూలపల్లి: మండలంలోని అబ్బాపూర్‌లో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నివేశన స్థలాలను బుధవారం ఎంపీడీవో పద్మజ, ఎంపీవో అనిల్‌రెడ్డి పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. త్వరలోనే ఇంటి నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. పంచాయతీ కార్యదర్శి సయిద్ మహిమిన్, కారోబార్ పుట్ట మల్లేశం ఉన్నారు.

• కుర్మపల్లిలో బస్‌షెల్టర్ కూల్చివేతకు యత్నం

పెద్దపల్లిరూరల్: కేశోరాం సిమెంట్ కర్మాగారం యజమాన్యం 20ఏళ్ల క్రితం నిర్మించిన బస్‌షెల్టర్‌ను ఇటీవల నిర్మించుకున్న తన ఇంటికి అడ్డుగా ఉందంటూ బుధవారం జేసీబీతో కూల్చేందుకు యత్నించగా పంచాయతీ కార్యదర్శి రజిత, స్థానికులతో కలిసి అడ్డుకున్నారు. గ్రామానికి చెందిన బీర్ల అయిలయ్య బస్‌షెల్టర్ తన ఇంటికి అడ్డుగా ఉందంటూ కూల్చేందుకు యత్నించాడని కార్యదర్శి ఫిర్యాదు చేశారని పెద్దపల్లి రూరల్ ఎస్‌ఐ మల్లేశ్ తెలిపారు. ఈ విషయమై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

• సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

గోదావరిఖని: ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించే కార్మికులకు సౌకర్యాలు కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏ గౌస్ డిమాండ్ చేశారు. నగరంలోని భాస్కర్‌రావుభవన్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్ల సంఖ్య పెరిగిన క్రమంలో కార్మికుల సంఖ్య కూడా పెంచాలన్నారు.

• శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో పూజలు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ శ్రీఅయ్యప్ప స్వామి ఆలయంలో శ్రావణమాస మొదటి బుధవారం కావడంతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దేవ్‌ప్రకాశ్ పాండే ఉదయం అయ్యప్పస్వామి మూలవిరాట్‌కు ఫల పంచామృతాలతో అభిషేకం చేశారు. అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

• నేడు గురుకులంలో ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్

రామగుండం: రామగుండంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో 2025–26లో ఇంటర్ ఎంపీసీ, బైపీసీ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్లను భర్తీ చేసేందుకు గురువారం రామగుండం జూనియర్ కళాశాలలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ మాధవి తెలిపారు. స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో ఉదయం 9గంటలకు హాజరైన వారి వివరాలు రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 2తర్వాత మెరిట్ లిస్టు ప్రకటించిన తర్వాత సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు.

• సుల్తానాబాద్ గురుకుల బాలుర కాలేజీలో

సుల్తానాబాద్: పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో ఇంటర్ 2025–26లో మొదటి విద్యా సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో మిగిలిన ఖాళీల భర్తీ కోసం 31న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సూర్యప్రకాశ్‌రావు తెలిపారు.

పర్యావరణంపై అవగాహన



జనపనార సంచులు అందజేస్తున్న అధికారులు

గోదావరిఖని: పర్యావరణ పరిరక్షణపై ఓసీపీ–1 బేస్ వర్క్‌షాప్‌లో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్విరాన్‌మెంట్ హెచ్‌వోడీ జీవీ సత్యనారాయణ క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు జనపనార సంచులు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ అధికారి కిషన్, నాయకులు జక్కుల దామోదర్‌రావు, అనుమట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



100 ఆకారంలో విద్యార్థులు

కోల్‌సిటీ: పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత ధ్యేయంగా చేపట్టిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక విజయవంతానికి సహకారం అందిస్తామని స్థానిక సప్తగిరి కాలనీ జ్యోతిబాపూలే బీసీ బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. 100 సంఖ్య ఆకారం ప్రదర్శించారు. బల్దియా అధికారులు, సిబ్బంది బుధవారం పాఠశాలను సందర్శించి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే అశోక్‌నగర్, గాంధీనగర్‌లో మురుగునీటి కాలువల్లో పూడిక తొలగించారు. 7ఎల్‌ఈసీకాలనీ, రైల్వేలైన్, ఇందిరానగర్ రోడ్డులో పిచ్చిచెట్లు తొలగించారు. శిథిలభవనాలు ఖాళీ చేయాలని నోటీసులు జారీచేశారు. ఆస్తిపన్ను సరి చేయడానికి కొలతలు నమోదు చేశారు. డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ఆర్ఐ శంకర్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, నాగభూషణం, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, మెప్మా సీవో శ్వేత తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించండి

గోదావరిఖనిటౌన్: అంగన్వాడీ టీచర్స్, ఆయాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షురాలు మేకల సాయీశ్వరి డిమాండ్ చేశారు.

సింగరేణి వార్తలు

విధులకు గైర్హాజరైతే ఉద్యోగానికే ముప్పు

గోదావరిఖని: విధులకు గైర్హాజరైతే ఉద్యోగం కోల్పోయే ప్రమాదముందని ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య స్పష్టం చేశారు. స్థానిక సీఈఆర్‌క్లబ్‌లో గైర్హాజరైన ఉద్యోగులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. గతేడాది వంద మస్టర్లు, ఈ ఏడాది జూన్ వరకు 50మస్టర్ల కన్నా తక్కువ కంటే తక్కువ డ్యూటీ చేసిన కార్మికులకు కౌన్సెలింగ్ చేశారు. ఉద్యోగులు విధులకు హాజరు కావడంలో నిర్లక్ష్యం వహిస్తే కుటుంబానికి ఆర్థికంగా నష్టం జరుగుతుందన్నారు. ప్రతీ ఉద్యోగి హాజరు శాతాన్ని పెంచుకొని సంస్థ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని సూచించారు. ఉద్యోగులు ప్రతీనెల 22రోజులు విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పర్సనల్ డీజీఎం అరవిందరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహిపాల్, డీవైపీఎం వంశీధర్, సీనియర్ పీవో సాధన్, సంక్షేమాధికారులు సాయికృష్ణ, నరేశ్, సెక్యూరిటీ అధికారి షరీఫ్‌మహ్మద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీఎం బండి వెంకటయ్య

సింగరేణి కార్మికులకు పదోన్నతి కల్పించాలి

గోదావరిఖని: సింగరేణి కార్మికులకు ఐఈడీ స్టడీ ప్రకారం పదోన్నతి కల్పించాలని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఏరియాలోని జీడీకే–1, 3వ గనిపై బుధవారం కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. పదోన్నతి విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. పలు గనులు డిపార్ట్‌మెంట్లలో ఐఈడీ స్టడీ చేయించి ఖాళీలు గుర్తించి పలు డిజిగ్నేషన్లకు, యాక్టింగ్ కార్మికులకు ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. గనుల్లో నడుస్తున్న పని పరిస్థితులు, యాంత్రీకరణ గనులకు అనుగుణంగా స్టడీ చేయించి పదోన్నతి ఇవ్వాలని కోరారు. నాయకులు ఆరెపల్లి రాజమౌళి, మేదరి సారయ్య, తోట నరహరిరావు, దాసరి సురేశ్, సాగర్, శశికిరణ్, శ్రావణ్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఆరోగ్యం

టింక్లయిన్‌కాలనీ: యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందుతుందని ఆర్జీ–2 ఏరియా జీఎం వెంకటయ్య, వారి సతీమణి, ఆర్జీ–2ఏరియా సేవాసమితి అధ్యక్షురాలు వనజ–వెంకటయ్య దంపతులు అన్నారు. ఆర్జీ–2 ఏరియా పోతనకాలనీలో సింగరేణి ఆధ్వర్యంలో బుధవారం ఆధునీకరించిన పతంజలి యోగా మందిరాన్ని జీఎం దంపతులు పునః ప్రారంభించారు. ఆర్జీ–2 ఏఐటీయూసీ నాయకులు శ్యాంసన్, డీజీఎం సివిల్ ధనుంజయ్, డీవైఎస్ఈ వినయ్ సాగర్, ఈఈ సివిల్ ప్రతాపగిరి రాజ, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్, పోతనకాలనీ మహిళలు పాల్గొన్నారు.

లింగాపూర్ గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించాలి



వినతిపత్రం అందిస్తున్న కందుల సంధ్యారాణి

గోదావరిఖని/రామగుండం: సింగరేణి, ఎన్టీపీసీ ప్రభావిత గ్రామమైన లింగాపూర్ అభివృద్ధికి నిధులు కేటాయించేలా చూడాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి కోరారు. కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని బుధవారం ఢిల్లీలో కలిసి వినతిపత్రం అందజేశారు. లింగాపూర్ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన ఎన్టీపీసీ, సింగరేణికి ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఎన్టీపీసీ సంస్థ ద్వారా లింగాపూర్ నుంచి గోదావరి పంప్‌హౌస్ వరకు సుమారు 3కిలోమీటర్ల సీసీరోడ్డు, ఇరువైపులా సైడ్ డ్రైన్స్ నిర్మించేలా ఆదేశాలివ్వాలని కోరారు. లింగాపూర్ నుంచి మేడిపల్లి ఓసీపీ వరకు సీసీరోడ్డు నిర్మించేందుకు సింగరేణి సీఎండీకి తగిన ఆదేశాలివ్వాలన్నారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆమె పేర్కొన్నారు.

నేత్రదానంపై అవగాహన సదస్సు

ఓదెల: సదాశయ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి ఆధ్వర్యంలో బుధవారం నేత్రదానాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఓదెలలో నేత్రదాత ఐలు శ్రీనివాస్ సంస్మరణ సభ జరిగింది. మృతుడు శ్రీనివాస్ భార్య కళావతి, కుమారులు రవితేజ, ఆకాశ్‌కు జ్ఞాపిక అందజేశారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి

రామగిరి: సింగరేణివ్యాప్తంగా సుమారు 30వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు అతి తక్కువ వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని, వెంటనే వారి వేతనాలు పెంచాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు. బుధవారం డైరెక్టర్ పాకు రాష్ట్ర కమిటీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. నాయకులు డి.బ్రహ్మానందం, ఎండీ రాశుద్దీన్, ఎన్.సంజీవ్, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ మాజీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు మాజీ ఉద్యోగుల సంక్షేమానికి తనవంతుగా కృషి చేస్తానని ఎన్టీపీసీ రామగుండం మాజీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆకుల రాంకిషన్ అన్నారు. పర్మినెంట్ టౌన్‌షిప్‌లో కొమ్ము గోపాల్ అధ్యక్షతన బుధవారం జరిగిన మాజీ ఉద్యోగుల సంఘం సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సంఘం సభ్యులు అధ్యక్షుడు ఆకుల రాంకిషన్‌తో పాటు పలువురిని సన్మానించారు. ప్రధాన కార్యదర్శి సట్టు ముత్యాలు, చెప్యాల శ్రీపతిరావు, తిరుమల సురేందర్‌గౌడ్, దుర్గం నర్సయ్య, పురుషోత్తంరావు, రాజయ్య, పోచయ్య, లాలయ్య, వెంకటేశ్వర్లు, గోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, అశోక్, లక్ష్మయ్యగౌడ్, రాజమల్లు, రాజయ్య, సుధాకర్, ప్రసాదరావు, రాజయ్య, వీరమల్లుగౌడ్, భాస్కర్‌రెడ్డి, సత్తయ్య, సాయిలు పాల్గొన్నారు.

ఎస్బీఐ డిజిటల్ సేవలు వినియోగించుకోవాలి

ఓదెల: ఎస్బీఐ డిజిటల్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. ఓదెలలో ఎస్బీఐ డిజిటల్ సేవాకేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న డిజిటల్ సేవా కేంద్రాల ద్వారా వ్యాపార లావాదేవీలు, ఆన్‌లైన్ సర్వీసులు అందుబాటులోకి వస్తాయన్నారు. నిర్వాహకులు మాజీ ఎంపీటీసీ బోడకుంట లక్ష్మి, చిన్నస్వామి, పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చీకట్ల మొండయ్య, మాజీ ఉపసర్పంచు వీరన్న పాల్గొన్నారు.



ఎస్బీఐ డిజిటల్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు